తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ సోమవారం 12 - 10 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజీలు : 2

# మీరు జూబ్లిహిల్స్‌లో ఉంటే..

# అమరుల కుటుంబాలు అడవుల్లో ఉండాలా..?



## మాజీ సర్పంచుల సంఘం జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య

- ❖ అమరవీరులపై సీఎం రేవంత్ రెడ్డికి ప్రేమ ఉంటే జూబ్లీహిల్స్‌లోనే కాలనీ కట్టించాలి
- ❖ తెలంగాణ బిడ్డలను బలి తీసుకుంది కాంగ్రెస్ కాదా
- ❖ చంపినోడే సంతాపం తెలిపినట్టుగా ఉంది సీఎం రేవంత్‌రెడ్డి తీరు
- ❖ కాంగ్రెస్ మూడేళ్ల పాలనలోనే రాష్ట్రం, రైతాంగం దివాళా తీసింది

**ప్రజావారధి/మోత్కూరు**

అమరుల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ లో నివాసం ఉంటే రాష్ట్ర సాధనలో అమరులైన కుటుంబాలు అడవుల్లో ఉండాలా అని మాజీ సర్పంచుల సంఘం జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య ప్రశ్నించారు. ఆదివారం మోత్కూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన అమరుల కుటుంబాలకు ఏ వసతులు లేని గజ్వేల్ అడవుల్లో కాలనీ కట్టిస్తానని చెప్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఆ కుటుంబాలను అవమాన పరుస్తున్నారని, సీఎం నివాసం ఉండే జూబ్లీహిల్స్‌లోనే అమరుల కుటుంబాలకు కాలనీ కట్టించాలని డిమాండ్ చేశారు. 1952 నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటంలో వేలమంది అమరులయ్యారని, తెలంగాణ బిడ్డలను బలి తీసుకున్న చరిత్ర కాంగ్రెస్‌దని, ఇంద్రవెల్లిలో వందల మందిని బలితీసుకుంది కాంగ్రెస్ కాదా అని, ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కాంగ్రెస్ పైనే ఉందన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకునే నైతిక హక్కు కాంగ్రెస్ నాయకులకు లేదని, చంపినోడే సంతాపం తెలిపినట్లుగా సీఎం రేవంత్ రెడ్డి వ్యవహారం ఉందని విమర్శిం చారు. కేసీఆర్ నాయకత్వంలో సబ్బండ వర్గాలు పోరాడి తెలంగాణ సాధించా రన్నారు. తెలంగాణ సాగు, తాగునీరు లేక రైతులు, ప్రజలు పట్టణాలకు వలస పోతుంటే పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులు కట్టి సాగునీరు అందించి వ్యవసాయాన్ని పండగ చేశారని, రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని, కానీ నేడు రైతులు ఆ సంతోషం లేదన్నారు. మూడేళ్ల పాలనలోనే సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని, రైతాంగాన్ని పూర్తిగా దివాళా తీయించార న్నారు. సీఎం రేవంత్ రెడ్డి కుటుంబం హైదరాబాద్ లో దోచుకోవడానికి భూములు ఉంటాయి గానీ అమరవీరుల కాలనీకి హైదరాబాద్‌లో భూమి దొరకడం లేదా అని ప్రశ్నించారు. తెలంగాణ అమరవీరుడు కాసోజు శ్రీకాంతాచారి పేరుతో హైదరా బాద్ నడి బోడ్డున స్థలం కేటాయించి అమరవీరుల కాలనీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మార్కెట్ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొన్నెబోయిన రమేష్, రైతు బంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు కొండ సోంమల్లు , బీసీ సెల్ మండల అధ్యక్షుడు పానుగుల విష్ణుమూర్తి, నాయకులు నేర్లకంటి మత్స్యగిరి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ పొన్నెబోయిన మత్స్యగిరి పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
జనరల్ న్యూస్
సోమవారం
12 - 10 - 2026


# కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర సోషల్ మీడియా ఇంచార్జ్‌గా భాస్కర్



ప్రజావారధి/శాలిగౌరారం

కురుమ యువ చైతన్య సమితి తెలంగాణ రాష్ట్ర సోషల్ మీడియా ఇంచార్జ్‌గా నల్గొండ జిల్లా శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన గుడపూరి భాస్కర్ కురుమ నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు కుండే వెంకటేష్ కురుమ, వర్కింగ్ ప్రెసిడెంట్ మోటే రవి కురుమ, రాష్ట్ర కమిటీ సంయుక్తంగా ఈ నియామకం చేపట్టారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర నాయకత్వానికి భాస్కర్ కురుమ కృతజ్ఞతలు తెలిపారు. కురుమ యువత చైతన్యం కోసం, సంఘ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

# రాష్ట్రస్థాయి అండర్-19 కబడ్డీ జట్టుకు షేక్ నస్రీన్ ఎంపిక



ప్రజావారధి/శాలిగౌరారం

జిల్లాస్థాయి అండర్-19 బాలికల అసోసి యేషన్ కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చిన శాలిగౌరారం మండలం వల్లాల మోడల్ స్కూల్ విద్యార్థిని షేక్ నస్రీన్ రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైంది. శాలిగౌరారం మండలం వల్లాల ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న షేక్ నస్రీన్(జాలోనిగూడెం) జిల్లాస్థాయి కబడ్డీ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. అక్టోబర్ 13 వరకు భద్రాద్రికొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఆమె ఎంపికైనట్లు ప్రిన్సిపల్ కృష్ణమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థిని షేక్ నస్రీన్ ను, ఆమెకు శిక్షణ ఇచ్చిన పిడి బొడ్డు మల్లేష్‌ను ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# శాలిగౌరారం బీసీ కాలనీలో కొలువుదీరిన దుర్గమ్మ



ప్రజావారధి/శాలిగౌరారం

శాలిగౌరారం మండల కేంద్రంలోని మార్కెట్ బీసీ కాలనీలో దుర్గామాత విగ్రహ ప్రతిష్టతో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కాలనీ వాసులు ఏర్పాటు చేసిన మండపంలో దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్టించారు. 16 మంది భక్తులు భవానీ దీక్ష మాల ధరించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు చేశారు. దుర్గామాత విగ్రహాన్ని కల్లూరి సైదులు-విమల దంపతులు విరాళంగా అందజేశారు. విగ్రహ ప్రతిష్ట, పూజా కార్యక్రమాలను గ్రామ పురోహితులు రామడుగు వెంకట్రామశర్మ నిర్వహించారు.

# ఢిల్లీ నిరసనలపై దమనకాండను ఖండిస్తున్నాం



ప్రజావారధి/శాలిగౌరారం

ఢిల్లీలో సీఈసీ తొలగింపు, సర్ రద్దు, బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికల నిర్వహణ డిమాండ్ చేస్తూ నిరసన తెలిపిన వారిపై లాఠీచార్జి, అక్రమ నిర్బంధాలను తీవ్రంగా ఖండిస్తున్నామని శాలిగౌరారం మండలం ఊట్కూరు గ్రామానికి చెందిన నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేముల గోపీనాథ్ అన్నారు. ఆయన ఆదివారం విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిందని, ప్రజల గొంతును పోలీసు బలగాలతో అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. సీఈసీ ను తొలగించాలని, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత కోసం బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.